ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025


కుణుతూరు వంకలో వినాయక ప్రతిమను నిమజ్జనం చేస్తున్న యువకులు




గొల్లపల్లి వంకలో నిమజ్జనం ...


సాహెబ్ చెరువులో నిమజ్జనం చేస్తున్న యువకులు


గొట్లూరులో విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామస్థులు


పుట్టపర్తిలో ఊరేగింపుగా వెళుతున్న గణనాథులు

సందడే సందడి..!

ఉత్సాహంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
సాయి కుల్వంత్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి తదితర నియోజకవర్గాలలో భక్తులు స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నదులు, చెరువులు, వంకల్లో నిమజ్జనం చేశారు. రంగులు చల్లుకుంటూ, డప్పు మోతలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి నేషనల్ కౌన్సిల్ స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఢిల్లీ, గుజరాత్, ఏపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాల విద్యార్థులు సాయికుల్వంత్‌లో వేదపఠనం చేశారు. సూరత్ విద్యార్థులు గార్బా నృత్యం, హరియాణా విద్యార్థులు బంగారాన్ డ్యాన్స్‌తో అలరించారు. సత్యసాయి విద్యార్థులు 'స్వాగతం కృష్ణా' పేరుతో సంగీత నృత్య ప్రదర్శన ఇచ్చారు. సత్యసాయి విద్యార్థులు ఏర్పాటు చేసిన గణేశ విగ్రహాలను సాయికుల్వంత్‌కు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి చిత్రావతి నదిలో నిమజ్జనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో 103 పాఠశాలలకు చెందిన 2400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. - **ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి**


సాయికుల్వంత్ హాలులో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


ప్రశాంతి నిలయం నుంచి తరలుతున్న గణనాథులు


వంకపల్లివద్ద గుట్టపై మాయమైన మట్టి

కొల్లగుట్ట

- **మట్టితరలింపుతో కరిగిపోతున్న నల్లగుట్ట**
- **ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు**

తనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొండలు, ప్రభుత్వ భూముల నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఫిర్యాదు చేసినా, స్పందించే అధికారులు కరువయ్యారు. ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తుండడంతో గుట్టలు, కొండలు కరిగి మాయమైపోతున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తనకల్లు మండల పరిధిలోని వంకపల్లి వద్ద నల్లగుట్ట నుంచి ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి యథేచ్ఛగా ట్రాక్టర్లతో తనకల్లుకు తరలిస్తున్నారు. తమ గ్రామం వద్ద ఉన్న సర్వేనెంబర్లు 1099, 1100 నల్లగుట్ట నుంచి మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. నేరుగా రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యామేమిటో అంతుచిక్కడంలేదని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు గ్రామంలోని సన్నజీవాలు మేపుకోవడానికి ఉపయోగపడిన నల్లగుట్ట కళ్లెదుటే మాయమైపోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని తరలించడంతో గుట్ట ప్రాంతంలోని పచ్చదనం హరించుకుపోయి పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోంది. ఉన్న గుట్టలు కూడా మయమైపోతే భవిష్యత్తులో తమ గ్రామానికి అవసరమైన మట్టిని ఎక్కడి నుంచి తెచ్చుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొండలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



మా గ్రామం వద్ద సర్వేనెంబర్ 1099, 1100లలో ఉన్న నల్లగుట్ట నుంచి మట్టిని యథేచ్ఛగా తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని స్వయంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.
- రమణ, రైతు సంఘం నాయకులు, వంకపల్లి

చర్యలు తీసుకుంటాం

వంకపల్లి వద్ద సర్వేనెంబర్ 1099, 1100ల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో ఎవరినైనా ఉపేక్షించేదిలేదు. తప్పకుండా చర్యలు తీసుకుంటాం. - **షాబుద్దీన్, తహసీల్దార్, తనకల్లు**

బిల్లులో చంద్రన్నా..!

అభివృద్ధి పనులకు బిల్లుల గండం

- **సీసీరోడ్లు, ప్యాచ్‌వర్కులు చేసిన కాంట్రాక్టర్లు**
- **8నెలలుగా బిల్లులు కోసం ఎదురుచూపులు**
- **అప్పుల తిప్పలు పడలేమంటూ ఆవేదన**

ధర్మవరం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేసిన అభివృద్ధి పనులకు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు 8 నెలలుగా ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో పనులు వేగంగా చేస్తే బిల్లులు కూడా వేగంగా వస్తాయన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశారు. వాటికి అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవాలు కూడా చేయించారు. అయితే బిల్లులు రాకపోవడంతో పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గానికి రూ.12కోట్ల నిధులతో సీసీరోడ్లు

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఉపాధి హామీ పథకం కింద ధర్మవరం నియోజకవర్గంలో రూ.12కోట్లతో సీసీరోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. మండలానికి రూ.3కోట్లు చొప్పున కేటాయించి, పనులు చేపట్టారు. ఒక్కో గ్రామంలో కనీసం రూ.20లక్షల వరకు సీసీరోడ్లు వేశారు. సంక్రాంతి లోపు సీసీ రోడ్లు ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు వేగంగా పూర్తి చేశారు. రోడ్ల పనులు పూర్తి చేసి, బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అల్లాడిపోతున్నారు.


కొత్తచెరువు-పుట్టపర్తి రోడ్డుకు ప్యాచ్‌లు


గరుడంపల్లిలో వేసిన సీసీరోడ్డు

రూ.కోటితో ప్యాచ్‌వర్కులు

వైసీపీ పాలనలో తారు రోడ్లపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. దీంతో ప్రభుత్వం ఆ రోడ్ల ప్యాచ్‌వర్కుల కోసం రూ.కోటి మంజూరు చేసింది. పుట్టపర్తి-కొత్తచెరువు, మామిళ్లపల్లి రహదారిలో ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్లతో పనులు చేయించారు. ప్యాచ్‌వర్కులతో పాటు ధర్మవరం మండలంలోని రహదారులకు అనుకోని ఉన్న కంప చెట్లు తొలగించారు. సుమారు 9 నెలలు గడుస్తున్న ఇంతవరకు బిల్లులు రాక పోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈక్రమంలోనే పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ బిల్లుల కోసం తిరుగుతున్నారు.


చిగిచెర్లలో నిర్మాణదశలో ఉన్న మినీగోకులం షెడ్డు

మినీగోకులాలు, పశువుల తొట్టెలకు అందని బిల్లుల

గ్రామాల్లో రైతులు మినీగోకులాలు నిర్మించుకున్నారు. పశువులకు నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. వీటికి కూడా బిల్లులు రాకపోవడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలో చాలాగ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. టార్గెట్ పూర్తి చేయించడంలో చూపిన శ్రద్ధ బిల్లులు మంజూరు చేయించడంలో అధికారులు చూపడం లేదని పాడి రైతులు విమర్శిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



నియోజకవర్గంలో పల్లెపండుగ కార్యక్రమంలో రూ. 12కోట్లతో సీసీ రోడ్ల పనులు ప్రారంభించాం. ఇప్పటివరకు రూ.10కోట్లు వరకు సీసీరోడ్లు వేయించాం. పనులు చేసిన వాటికి ఎఫ్‌టీఓలు సిద్ధం చేసి బిల్లులు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ అవుతాయి.
- శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈ, ధర్మవరం

చెప్పిన దారిలోనే వెళ్లండి..!

- **నిమజ్జనోత్సవంపై ఎస్పీ జగదీష్**
- **అనంతలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు**

అనంతపురం క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం గణేష్ విగ్రహాల శోభాయాత్ర నిర్దేశించిన రూట్లలోనే సాగాలని ఎస్పీ జగదీష్ సూచించారు. శోభాయాత్ర, నిమజ్జనం వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ల పర్యవేక్షణ ఉం టుందని తెలిపారు. క్రమపద్ధతిలో విగ్రహాలను తరలించాలని వినాయక ఉత్సవ కమిటీలకు సూచించారు. బాణసంచా కాల్చడం, మద్యం తాగి వేడుకల్లో పాల్గొనడం, భారీగా శబ్దాలు చేయడం సరికాదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హె చ్చరించారు. విగ్రహాలను తరలించాల్సిన మా ర్గాల వివరాలను తెలియజేశారు.

రూట్ -1

తాడిపత్రి బస్టాండ్ - బసవన్నకట్ట, సూర్యనగర్ సర్కిల్, జేఎన్‌టీయూ, కలెక్టరేట్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సంఘమేష్ సర్కిల్ మీదుగా సూర్యనగర్ సర్కిల్ వద్ద కలవాలి. అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్ చేరుకోవాలి. హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్ సర్కిల్, నాయక్‌నగర్, ఆదర్శనగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు అశోక్ నగర్, సాయినగర్ మీదుగా సప్తగిరి సర్కిల్‌కు చేరుకోవాలి.

రూట్-2

ఒకటో రోడ్డు నుంచి 6వ రోడ్డు వరకూ, రామచంద్ర నగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సైఫుల్లా ఫ్రైవర్ బ్రిడ్జి మీదుగా శ్రీకంఠం సర్కిల్ వద్దకు చేరుకుని, ఎన్టీఆర్ సర్కిల్(మిగతా 7లో...)

ముగిసిన వెరిఫికేషన్

- **డీఎస్సీ-2025 సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి**
- **విడుదల కాని మరో 50మంది అభ్యర్థుల జాబితా** (6లో...)

అప్పులకు చేనేత కార్మికుడి బలి

(వివరాలు 7వ పేజీలో..)

సత్యసాయి బోర్డు మెంబర్ సెక్రటరీగా ప్రభాకర్‌రావు

61,984

ఆగస్టులో బియ్యం తీసుకోని కార్డుదారుల సంఖ్య

- **కొందరు డీలర్ల ఇష్టారాజ్యం**
- **కొన్నిరోజులు పంపిణీ చేసి.. తర్వాత మూసేస్తున్న వైనం**
- **కొరవడిన అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు**
- **ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు**

కొత్తచెరువు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా వేల సంఖ్యలో రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు తీసుకోకపోవడం ఆశ్చర్యకరం. ఆగస్టులోనే జిల్లా వ్యాప్తంగా 61,984 మంది బియ్యం తీసుకోలేదని పౌరసరఫరాల శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. కొందరు డీలర్ల ఇష్టారాజ్యమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కొన్ని రోజులు మాత్రమే సరుకులు పంపిణీ చేసి, తర్వాత మూసేస్తుండడంతో చాలామంది కార్డుదారులు నష్టపోతున్నారని తెలుస్తోంది. సరుకులు తీసుకోలేకపోతున్నారని సమాచారం. రేషన్ పంపిణీపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, తనిఖీల ఊసే లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రతినెలా.. వేలల్లో..

జిల్లాలోని 32 మండలాల్లో 1,367 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 5,72,631 కార్డులు ఉన్నాయి. ప్రతినెలా 17,89,342 మంది సరుకులు పొందుతున్నారు. ఆగస్టులో జిల్లావ్యాప్తంగా 61,984 మంది బియ్యం తీసుకోలేదని పౌరసరఫరాల శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రతినెలా 50 నుంచి 60 వేల మంది సరుకులు పొందలేకపోతున్నట్లు తెలుస్తోంది.

డీలర్ల తప్పిదాలే కారణమా..?

జిల్లావ్యాప్తంగా రేషన్ డీలర్లు ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు బియ్యం ఇతర సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. ఆయా రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులను తెరవాల్సి ఉంటుంది. జిల్లాలో చాలామంది డీలర్లు 10వ తేదీ వరకే సరుకులు పంపిణీ చేస్తున్నారని కార్డుదారులు వాపోతున్నారు. మిగిలిన రోజుల్లో దుకాణాలను మూసి వేస్తుండడంతో సరుకులు పొందలేకపోతున్నారు. పోర్టబిలిటీ కింద కార్డుదారులు వేరే ప్రాంతాల్లోని డీలర్ల వద్దకు బియ్యం కోసం వెళ్తే తమ పరిధి కాదని చెబుతూ వెనక్కి పంపుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు.


రేషన్ బియ్యం పంపిణీ (ఫైల్)

తనిఖీలు లేక ఇష్టారాజ్యం

రేషన్ దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం రేషన్ దుకాణాలను ప్రతినెలా డిప్యూటీ తహసీల్దార్లు తనిఖీలు చేయాల్సి ఉంది. సీఎస్‌డీటీ 10, డీఎస్‌ఓ 10, తహసీల్దార్ 4, ఆర్డీఓ 4, జేసీ 2 దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో తనిఖీల ఊసేలేదని తెలుస్తోంది.

దుకాణాలను తనిఖీ చేస్తున్నాం

జిల్లావ్యాప్తంగా రేషన్ షాపులను తనిఖీ చేస్తున్నాం. ప్రతి డీలర్ 1 నుంచి 15వ తేదీ వరకు సరుకులు తప్పనిసరిగా పంపిణీ చేయాలి. కార్డుదారులకు ఇబ్బంది కలిగించే డీలర్లపై చర్యలు తీసుకుంటాం. సరుకుల పంపిణీలో అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం త్వరలో ప్రత్యేక యాప్‌ను తీసుకురానుంది.
- వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

పేదల గుండె ధైర్యం పరిటాల

- **బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
- **పెనుకొండలో పరిటాల రవి విగ్రహావిష్కరణ**

పెనుకొండ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పరిటాల అంటే పేరు కాదని, పేద ప్రజల గుండె ధైర్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ దర్గా సర్కిల్‌లో తను స్వయంగా ఏర్పాటు చేయించిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాన్ని ఆమె శనివారం ఆవిష్కరించారు. అంతకు మునుపు పరిటాల కుటుంబ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. అరాచకాలు, దాడులను ఎదుర్కొనడానికే పరిటాల రవీంద్ర జీవితం మొత్తం సరిపోయిందని అన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనను రాజకీయాలలోకి రావాలని ఆహ్వానించారని, కానీ తన తండ్రి అంగీకరించలేదని అన్నారు. ఆయన కల ఇప్పుడు నెరవేరిందని, తాను రాజకీయాల్లోకి వచ్చి మంత్రిని అయ్యానని అన్నారు. పరిటాల రవీంద్ర మహిళలకు అండగా పెద్దన్నయ్యలా ఉండేవారని, అప్పట్లో తాగునీటి కోసం పరగోడు ప్రాజెక్టు వద్ద యుద్ధం చేశారని అన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లా (మిగతా 6వ పేజీలో...)


మాట్లాడుతున్న మంత్రి సవిత

బార్‌లకు లక్కీ డ్రా

- **దక్కించుకున్నవారికి ధ్రువపత్రాలు**


బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్సులకు లక్కీడ్రా నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ చేతన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు


ఐదో రోడ్డులో రేణుకా యల్లమ్మ అలంకారంలో గణపతి


రెడ్డివీధిలో అష్టలక్ష్మి సమేత విఘ్ననాథుడు



సాయినగర్ రెండో క్రాస్‌లో కర్ణాటక కరప్పన్ అలంకారం


హరిహర దేవాలయం వద్ద కృష్ణావతార గణపతి


విద్యారణ్య నగర్‌లో ఎలుకపై బాల గణపతి విహారం


మారుతీనగర్ మొదటిక్రాస్‌లో సుబ్రహ్మణ్యేశ్వర గణపతి


కోవూర్‌నగర్‌లో శివరుద్రరూప గణపతి



కమలానగర్‌లో జలకన్య అలంకారంలో



విభిన్ననాయకా.. నమోస్తుతే..!

వినాయక చవితి వేడుకలు ఆఖరి ఘట్టానికి చేరువయ్యాయి. అనంతపురం నగరం సహా పలు ప్రాంతాల్లో ఆదివారం స్వామివారు గంగమ్మ ఒడిలోకి చేరనున్నారు. ఎప్పటిలాగే భిన్నమైన విగ్రహాలను కొలువుదీర్చేందుకు అనంత భక్తులు ఆసక్తి చూపించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ విగ్రహాల ఏర్పాటుకంటే.. ఆధ్యాత్మిక విశేషాలు, ఆధునికత ఉట్టిపడే విగ్రహాల ఏర్పాటుకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇలాంటి విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎక్కడెక్కడ ఎలాంటి విగ్రహాలను ఏర్పాటు చేశారో తెలుసుకుని, అక్కడికి వెళ్లి తిలకించారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం**

ముగిసిన వెరిఫికేషన్

డీఎస్సీ-2025 సర్టిఫికెట్ల పరిశీలన దాదాపు పూర్తి

విడుదల కాని మరో 50మంది అభ్యర్థుల జాబితా

అనంతపురం విద్య, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025 నియామకాల ప్రక్రియలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. రాష్ట్రశాఖ ఇప్పటివరకు రెండువిడతలలో ఎంపిక అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. సెలెక్ట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు నేరుగా రాష్ట్రశాఖ నుంచే కాల్‌లెటర్స్(మెసేజ్‌లు) పంపారు. మొత్తం 757 మందికి పంపగా, ఆ మెసేజ్‌లు వచ్చిన అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. నగర శివారు పీవీకేకే కళాశాలలో ఈ పరిశీలన ప్రక్రియ ఈనెల 28నుంచి కొనసాగించారు జిల్లా పరిశీలకులు జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో 19కమిటీలు ఏర్పాటు చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. ఈ ప్రక్రియ శుక్రవారమే ముగియాల్సి ఉన్నా 9మంది గైర్హాజరుకావడంతో వారికి శనివారం వరకు అవకాశం కల్పించారు. దీంతో ఇందులో ఉన్న ఆరుగురు అభ్యర్థులు శనివారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. దీంతో తొలివిడత వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసింది.

● ఇద్దరి ఎంపిక తిరస్కరణ, మరొకరికి రేపటి వరకు గడువు

రాష్ట్రశాఖ 757 మందితో సెలెక్ట్ జాబితాను జిల్లాకు పంపింది. ఇందులో మూడు రోజులు జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 754 మంది హాజర య్యారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. సెలెక్ట్ జాబితాలో ఉన్న ఇద్దరి ఎంపికను జిల్లా విద్యాశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తిరస్కరించారు. చంద్రమౌళి అనేఅభ్యర్థి పీహెచ్‌కింద ఎంపిక జాబితాలో పేరు వచ్చింది. అయితే పరిశీలనకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకు రాకపోవడంతో పరిశీలన కమిటీ అభ్యంతరం చెప్పింది. విషయం డీఈఓ ప్రసాద్ బాబు దృష్టికి రావడంతో ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకువస్తేనే ఆమోదం పొందుతుందని చెప్పి పంపారు.. ఆయన తిరిగి పరిశీలనకు రాకపోవడంతో ఎంపిక అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. మరో అభ్యర్థి వెంకటరమణ ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఎంపికఅయ్యారు. నిబంధనల మేరకు ఆయన సర్టిఫికెట్లు చూపించకపోవడంతో తిరస్కరించినట్లు డీఈఓ తెలిపారు. శ్రీనివాసులు అనే అభ్యర్థి పీహెచ్ కోటాలోనే ఎంపికకాగా, ఒరిజనల్ సర్టిఫికెట్లకు సంబందిత ఆస్పత్రినుంచి రాలేదని చెప్పడంతో ఆయనకు సోమవారం వరకు అవకాశం ఇచ్చారు.

● మరో జాబితా కోసం నిరీక్షణ

జిల్లాలో 807 టీచర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే ఇప్పటికి 757మందిజాబితా మాత్రమే రావడం జరిగింది. ఇంకా 50మంది అభ్యర్థుల సెలెక్ట్ జాబితా రావాల్సి ఉంది. శనివారం కూడా విడుదల కాలేదు. సోమవారం ఈజాబితా వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చెబుతోంది.


డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పల్లె ఉమాకు ఘన నివాళి

కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీల నాయకుల శ్రద్ధాంజలి

అనంతపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమాకు కుటుంబ సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మండలంలోని కక్కలపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో పల్లె ఉమా ఘాట్ వద్ద శనివారం ఏడో వర్ధంతి నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, మనవడు, మనవరాలు వియాన్, వన్యా, వియ్యంకులు కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి, పీవీకేకే యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితర కుటుంబ సభ్యులు ముందుగా పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. వీరితోపాటు ఉమ్మడి జిల్లాలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బాలాజీ విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు. పుట్టపర్తి నుంచి పల్లె ఉమా ఘాట్ వరకు టీడీపీ యువ నాయకులు రామ్‌లక్ష్మణ్ ఆధ్వర్యంలో 300మంది యువకులతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లె ఉమాకు నివాళులు అర్పించారు. దీంతో వ్యవసాయ క్షేత్రం జనసంద్రంగా మారింది.


నివాళులు అర్పిస్తున్న పల్లె రఘునాథరెడ్డి, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు అమిలినేని, పల్లె సింధూర, పల్లె కిశోర్, టీడీపీ నాయకులు

ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రతిపక్షపార్టీ నేతలు హాజరు

పల్లె ఉమాకు ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు, ఎమ్మెస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి నివాళులు అర్పించారు. వీరితోపాటు ఏడీసీసీబీ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్ మొద్దీన్, నగర మాజీ మేయర్ స్వరూప, డిప్యూటీ మేయర్ గంపన్న, సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, వేమయ్య యాదవ్, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, జాఫర్, కేశవరెడ్డి, శ్రీరాములు, సీపీఎం రాష్ట్ర నాయకులు రాంభూపాల్, పెద్దిరెడ్డి, నాగేంద్ర, ప్రముఖ వైద్యులు సుధీంద్ర, రామ్మోహన్, రాంప్రసాద్, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు నివాళులు అర్పించారు.


పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు

మెగా రక్తదాన శిబిరం

పల్లె ఉమా వర్ధంతిని పురస్కరించుకుని వ్యవసాయ క్షేత్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పుట్టపర్తి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలోని సిబ్బంది, కార్మికులకు వస్త్రదానం చేశారు. విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మథేశ్వర్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, శర్మ, రాఘవేంద్ర, ప్రకాష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి


పరిటాలరవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ తదితరులు

రామగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దివంగత పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలు మండలంలోని వెంకటాపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో కుమారులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, కోడళ్లు పరిటాల జ్ఞాన, పరిటాల తేజస్వినిలతో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించిన అనంతరం ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదాన చేశారు. మండలంలో కూడా పలు చోట్ల పరిటాల రవీంద్రజయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రామగిరి టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

తూతూమంత్రంగా..!

● రోడ్డు పనుల్లో నాణ్యత డొల్ల ● నెల రోజులకే ధ్వంసమైన రహదారులు


ఉండబండ దేవాలయం వద్ద పగిలి పోయిన రోడ్డు

విడపనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పనులు నాణ్యతగా చేయకపోవడంతో రోజుల వ్యవధిలోనే రోడ్లు పాడైపోతున్నాయి. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. మండలంలోని ఉరవ కొండ నుంచి ఉండబండ మీదుగా పాల్తూరు గ్రామం వెళ్లేందుకు దాదాపుగా 14 కిలో మీటర్లు తారురోడ్డు నిర్మాణానికి రూ. 2.5 కోట్ల నిధులు కేటాయించారు. ఈ రోడ్డు పనులను జూలైలో ప్రారంభించి ఆగస్టులో పూర్తి చేశారు. అయితే రోడ్డు మాత్రం అప్పుడే ఎక్కడ పడితే అక్కడ పగిలిపోయింది. అలాగే ఉరవకొండ-బళ్లారి 42వ జాతీయ రహదారి వద్ద నుంచి పాల్తూరుకు వెళ్లే రోడ్డు పనులు రెండు కిలోమీటర్లు చేశారు. మధ్యలో రెండు కిలోమీటర్లు వైసీపీ ప్రభుత్వంలో చేయటంతో వాటిని వదిలేసి ఉండబండ ఆలయం వరకూ దాదాపుగా ఆరు కిలోమీటర్లు తారు రోడ్డు పనులు చేశారు. మధ్యలో అక్కడక్కడ ధ్వంసమైన పాత రోడ్డును తొలగించి పాల్తూరు నుంచి పనులు చేపట్టారు. ఉరవకొండ నుంచి ఉండబండ వరకూ తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. తిరిగి పాల్తూరు నుంచి ఉండబండ వరకూ ఎదురు రోడ్డు వేసుకుంటూ వస్తున్నారు. ఇటు వైపు వేసిన రోడ్డు అప్పుడే శిథిలమై పాత రోడ్డును తలిపిస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పనుల్లో నాణ్యత లోపిస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఈ విషయమై ఆర్అండ్‌బీ ఎఈ నాగభూషణంను వివరణ కోరగా రోడ్డు వేసిన వెంటనే 15 రోజులు వర్షాలు రావటంతో పగిలిందని అన్నారు. దీనికి తోడు పెద్ద పెద్ద వాహనాలు రోడ్డుపై వెళ్తూ ఉండటం కూడా ధ్వంసమవడానికి కారణమన్నారు. పాల్తూరు నుంచి రోడ్డు వేస్తూ వస్తున్నారు. దీనిపై మళ్లీ రోడ్డు వేయిస్తామని తెలిపారు.


మారెమ్మ గుడి నుంచి వంద మీటర్లకు పైగా ఇలా పగిలిపోయింది..


ర్యాలీగా వస్తున్న మంత్రి సవిత, పరిటాల కుటుంబం, ఎమ్మెల్యేలు


అభివాదం చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్, సిద్ధార్థ

పేదల గుండె ధైర్యం పరిటాల

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేశారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సవితను పరిటాల కుటుంబం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కృష్ణమూర్తి, గుట్టూరు సూరి, మావటూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రవి రాకతో ప్రజల్లో ధైర్యం: ఎంపీ బీకే పార్థసారథి

అనంతపురం జిల్లాలో 1993లో అరాచకాలు ఎక్కువగా ఉండేవి. పెనుకొండలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాని సమయంలో ఎన్టీఆర్ పరిటాల రవీంద్రను తీసుకొచ్చారు. ఆయన రాకతో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చారు. ఆయనకు అండగా నిలిచి ఎన్నికల్లో గెలిపించారు. బడుగు బలహీనవర్గాలు రాజకీయంగా ఎదగడానికి ఆయన ఎంతో కృషి చేశారు. అందులో నేనూ ఒకడిని.

కల నెరవేరింది: ఎమ్మెల్యే పరిటాల సునీత

నందమూరి తారక రామారావు ఆశయాలతో జిల్లాలో పెత్తందారులను తొక్కడానికి వచ్చిన నాయకుడు పరిటాల రవీంద్ర. నా భర్త మరణానంతరం నాకు రాజకీయం నేర్పించిన దేవుళ్లు పెనుకొండ ప్రజలు. పరిటాల కుటుంబం ఉన్నంతవరకు ఈ నియోజకవర్గ ప్రజలను మరిచిపోము. సీనియర్ నాయకుల అండతో అన్ని రకాలుగా అభివృద్ధి చేశాను. మాకు రాజకీయ భిక్ష పెట్టింది మొదట ఎన్టీఆర్, ఆ తరువాత పెనుకొండ ప్రజలు. పరిటాల రవి ఎనిమిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిన మంత్రి సవితకు మా కుటుంబం అండగా ఉంటుంది. ఇక్కడ పరిటాల రవీంద్ర విగ్రహం ఉండాలన్నది నా చిరకాల కోరిక. నేడు నెరవేరింది.

కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేస్తాం

కళ్యాణదుర్గంలో పరిటాల రవీంద్ర విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. పరిటాల కుటుంబంతో మాకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయనకు రాష్ట్రంలోనే కాకుండా పలుదేశాల్లో అభిమానులు ఉన్నారు. ఆయన మరణానంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట పరిటాల సునీత నామినేషన్ కోసం పలువురు ప్రాణాలు అర్పించారు. పరిటాల సునీత గెలుపుకోసం ప్రతి కార్యకర్త ఒక అల్లూరి సీతారామరాజు అయ్యారు.

- ఎమ్మెల్యే అలిమినేని సురేంద్ర

ప్రత్యర్థుల గుండెల్లో సింహస్వప్నం

ప్రత్యర్థుల గుండెల్లో పరిటాల రవీంద్ర సింహస్వప్నం. పేదలకు, అభాగ్యులకు, బాధితులకు అండగా ఉన్న నాయకుడు ఆయన. రాజకీయ చరిత్రలో తిరుగులేని నాయకుడు. ఈ జిల్లాలో ఎందరో మంత్రులు, ఎమ్మెల్యేలు అయి ఉంటారు. కానీ పరిటాల రవి రాసిన చరిత్రను మార్చలేరు. కొంతమంది కుటుంబం కోసం పుడతారు. కొంతమంది ప్రజల కోసం పుడతారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేవారు అతికొద్ది మంది ఉంటారు. వారిలో పరిటాల రవీంద్ర ఒకరు.

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గర్వకారణం

పేద, బడుగు, బలహీనవర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పరిటాల రవీంద్ర. కరువు జిల్లా అనంతలో ఆయన పుట్టడం జిల్లాకు గర్వకారణం. తెలుగుదేశం పార్టీలో పరిటాల రవి ఉండటం గర్వకారణమని అప్పట్లో ఎన్టీఆర్ అన్నారు. మంత్రి సవిత పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం.

- జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజనేయులు

మీ రుణం తీర్చుకోలేం: పరిటాల శ్రీరామ్

పరిటాల కుటుంబం రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే పెనుకొండ ప్రజలు అన్నివిధాలుగా అండగా నిలిచారు. మా విజయానికి, రాజకీయంగా నిలదొక్కుకునేందుకు కృషి చేశారు. పెనుకొండ ప్రజల రుణం తీర్చుకోలేనిది. పెనుకొండ అంటేనే పరిటాల అని ఎక్కడికెళ్లినా గుర్తు చేస్తారు. పెనుకొండ ప్రజల త్యాగాలు, వారి భిక్షతోనే ఈ రోజు రాజకీయాలు చేయగలుగుతున్నాం. మా తల్లి నామినేషన్‌ను మరిచిపోలేము. మృతదేహాలపై నడిచివెళ్లి నామినేషన్ వేశాము. అలాంటి సమయంలో కూడా మాకు అండగా నిలబడ్డారు.

క్రైం కార్నర్

అప్పులకు చేనేత కార్మికుడి బలి



రమేష్ (ఫైల్)

బత్తలపల్లి ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మండలంలోని ఎం. చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిట్రా రమేష్ (34) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. రమేష్ గత 15 సంవత్సరాలుగా సొంతమగ్గం నేస్తూ జీవించేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర రాక, అప్పులతో నెట్టుకొచ్చాడు. పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చేదంటూ భార్యతో తరచూ మథనపడేవాడు. ఈ నేపథ్యంలోనే తీవ్రంగా మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి రూ.10లక్షలు అప్పులు ఉన్నట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైతు ఆత్మహత్య

డీ.హీరేహాళ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన రైతు కృష్ణారెడ్డి(62) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు కృష్ణారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా కృష్ణారెడ్డి ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 26న ఇంట్లో ఉన్న క్రిమి సంహారక మందుని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు కృష్ణారెడ్డికి భార్య అనంతలక్ష్మి, కుమారుడు దేవరెడ్డి, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్..

గార్లదిన్నె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామ స్టేట్ బ్యాంకు సమీపంలో శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్ వడ్డే రాజశేఖర్ (32) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వడ్డే రాజశేఖర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత కొద్దిరోజుల నుంచి మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడ్డాడు. తీవ్ర మనస్తాపం చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వడ్డే రాశి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రూ.ఐదు లక్షలు చోరీ

గాండ్లపెంట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలోని పల్లెవాండ్లపల్లి గ్రామంలో రూ.ఐదు లక్షలు చోరీ అయినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారు తెలిపిన మేరకు పల్లెవాండ్లపల్లిలో నివాసముంటున్న వాసుదేవ పశువులు మేపుకుంటూ జీవిస్తున్నాడు. పశువులు, పేడ అమ్ముకుని రూ. ఐదులక్షలు జమ చేసుకుని, డబ్బుని ఇంట్లోని బీరువాలో దాచుకున్నాడు. రోజులాగానే శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో పశువులను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం 7గంటలకు వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాను తెరచి, అందులో ఉన్న డబ్బు మొత్తం చో చేశారు. ఈవిషయంపై శనివారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన ఫిర్యాదు మేరకు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ తో పరిశీలించామన్నారు.

రాయంపల్లిలో...

రాయదుర్గంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామంలో తిప్పేస్వామి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. తిప్పేస్వామి డి.హీరేహాళ్‌లోనే ఉంటూ ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. వారానికోసారి రాయంపల్లికి వచ్చి వెళ్లేవాడు. దీంతో ఇంట్లో ఒక్కతే ఉండలేని అతడి భార్య వరలక్ష్మి గ్రామంలోనే ఉండే పుట్టింటికి వెళ్లేది. ఈనేపథ్యంలో తిప్పేస్వామి శుక్రవారం విధులకు వెళ్లిపోయాడు. యథాప్రకారం వరలక్ష్మి ఇంటికి తాళం వేసుకుని పుట్టింటికి వెళ్లింది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి వాకిలి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రెండున్నర తులాల బంగారం, రూ. 10 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేసినట్లు బాధితురాలు వరలక్ష్మి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దొంగతనం కేసు నిందితుడి అరెస్టు

పుట్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగగా మారిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యబాబు శనివారం విలేకరులకు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22న పుట్లూరు బీసీకాలనీలో బాలన్న ఇంటిలో చోరీ జరిగింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. పాత నేరస్థుల డేటా ఆధారంగా విచారించగా అదే గ్రామానికి చెందిన బాలచంద్ర అలియాస్ బాలును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విచారణలో అతడు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి మూడు జతల బంగారు కమ్మలు, 8గ్రాముల బంగారం చైన్, రెండు బంగారు ఉంగరాలు, 25తులాల వెండి గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 15న పుట్లూరు బస్టాండ్ ఆవరణలో ఉన్న కిరాణా షాపులో రూ.7450 దొంగతనం చేయగా రికవరీ చేశామన్నారు. నిందితున్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

యువతి తండ్రిపై కొడవలితో దాడి

నార్పల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సూర్యనగర్ కాలనీలో నివాసముంటున్న యువకుడు హేమేష్‌కుమార్ అదే కాలనీకి చెందిన వ్యక్తిపై శనివారం కొడవలితో దాడి చేశాడు. బాధితుడి కుమార్తెను హేమేష్‌కుమార్ ప్రేమ పేరుతో వేధించేవాడు. ఆ అమ్మాయి ఇంటి వైపు బైక్‌లో తిరేగేవాడు. ఇది గమనించిన ఆమె తండ్రి హేమేష్‌కుమార్‌ను మందలించాడు. దీంతో కోపోద్రిక్తుడైన హేమేష్‌కుమార్ కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువతి తండ్రిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళపై కత్తితో..

మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో జమీలా అనే మహిళపై లక్ష్మిరెడ్డి అనే యువకుడు శనివారం కత్తితో దాడిచేసి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు జమీలా భర్తతో విడాకులు తీసుకుని గత కొద్ది రోజులుగా వెంకటాంపల్లిలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈక్రమంలోనే శనివారం మధ్యాహ్నం జమీలా పొలం వద్దకు వెళ్లింది. వెంబడించిన లక్ష్మిరెడ్డి ఆమెపై కత్తితో దాడిచేసి పారిపోయాడు. గాయపడిన ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన లక్ష్మిరెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా ఆ మహిళపై లక్ష్మిరెడ్డి ఎందుకు దాడిచేశాడనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గువ్వలగుట్టపల్లిలో వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. వినాయడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వెళుతుండగా... ట్రాక్టర్‌పై ఉన్న గ్రామానికి చెందిన నరసింహమూర్తి(40) ఒక పచ్చి కర్ర తీసుకుని స్థానిక చెరువు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలను విగ్రహానికి తగలకుండా పైకి ఎత్తే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో అతడు విద్యుదాఘాతమై అక్కడికక్కడే మృతిచెందాడని గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కుటుంబ యజమాని మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

భూ సేకరణపై దృష్టి సారించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏజెంట్ స్పేస్(ఈటీపీఎస్)లో డాక్యుమెంట్ అప్లోడ్, పీఎం కుసుమ్ యోజనలో భాగంగా పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఆర్ఓ మలోల, ఇతర అధికారులతో కలిసి ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ పీఎం కుసుమ్ యోజన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ పథకం ద్వారా రైతులు పంటలు సాగు చేయడానికి సౌర శక్తిని ఉపయోగించుకునే వీలు కలుగుతుందన్నారు. వ్యవసాయ పద్ధతుల్లో అనేక మార్పులు, ప్రయోజనాలు పొందేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఐదు కిలోమీటర్ల దగ్గరగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న చోట భూసేకరణ పనులు చేపట్టాలన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నాణ్యతగా లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెంట్ స్పేజ్ ఈటీపీఎస్ పోర్టల్‌లో సంబంధిత శాఖలకు చెందిన పలు డాక్యుమెంట్లు అప్లోడ్ పనులను జాగ్రత్తగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రయ్ రయ్.. రేస్..!

- కొండ ప్రాంతాల్లో కార్లు.. బైక్‌ల సందడి
- పుట్లూరు.. నార్పల నడుమ దుమ్ము రేపే ఆట

వస్తున్నా.. కాస్కో..





దుమ్ము రేగాల్సిందే..

పుట్లూరు, నార్పల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామ శివారులో బైకు, కార్ రేస్ పోటీలు జరుగుతున్నాయి. 'దక్షిణ్ డేర్ క్రాస్ కంట్రీ ర్యాలీ అండ్ బైక్ రేస్' పేరిట ఈ పోటీలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. పుట్లూరు మండలం నుంచి నార్పల మండలం వరకూ ఉన్న కొండ ప్రాంతాల్లో జరుగుతున్న బైక్, కార్ రేస్‌ను చూసేందుకు జనం ఆసక్తిగా తరలివచ్చారు. ఏపీ, తెలంగాణ, గోవా, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల రేసర్లు శనివారం జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. జిల్లాలో మూడు రోజులపాటు ఈ పోటీలను నిర్వహించేందుకు కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ అనుమతి ఇచ్చారు.

అదుపుతప్పిన కార్లు

పుట్లూరు మండలం మడుగుపల్లి శివారులో రేస్‌లో పాల్గొన్న ఓ కారు శనివారం అదుపుతప్పింది. బెంగళూరుకు చెందిన ఓ కంపెనీ కారు మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేక కొండకిందకు ఒరిగింది. రేసర్ అలాగే బ్రేక్ వేసి నిలబెట్టారు. వెనుక వస్తున్న కార్లు వెళ్లాక సిబ్బంది వచ్చి మరో కారు సాయంతో బయటకు లాగారు. మరో రెండు ప్రాంతాల్లోనూ కార్లు అదుపు తప్పాయి. ఎవరికీ గాయాలు కాలేదు. పుట్లూరుకు బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని రేస్‌లో పాల్గొన్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి బైక్ రైడర్ రూ.లక్ష పరిహారం ఇచ్చారని తెలిసింది.



మడుగుపల్లి కొండలో అదుపుతప్పిన కారు

డీఎంఈగా డాక్టర్ రఘునందన్

- అంచెలంచెలుగా ఎదిగిన అనంత విద్యార్థి
- గుత్తిలో పాఠశాల విద్య.. తిరుపతిలో వైద్య విద్య



అనంతపురం వైద్యం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అనంత విద్యార్థి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రఘునందన్ రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్‌గా(డీఎంఈ) నియమితులయ్యారు. ఆయన తల్లి వసంతలక్ష్మి గుత్తి పట్టణానికి చెందినవారు. తండ్రి డాక్టర్ గోపాల్‌కృష్ణ కర్నూలుకు చెందినవారు. డాక్టర్ గోపాల్‌కృష్ణ ఎస్వీ మెడికల్ కాలేజీలో ఫార్మాకాలజీ ప్రొఫెసర్‌గా సేవలందించి రిటైర్డ్ అయ్యారు. డాక్టర్ రఘునందన్ గుత్తి హైస్కూల్‌లో చదువుకున్నారు. కర్నూలులో ఇంటర్ పూర్తిచేశారు. ఎంబీబీఎస్, ఎంఎస్ తిరుపతిలో అభ్యసించారు. 1994లో డాక్టర్‌గా కడపలో సేవలను ప్రారంభించారు. నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం వైద్య కళాశాలల్లో సేవలందించారు. ఆయన భార్య మచిలీపట్నం మెడికల్ కాలేజీలో ఆప్తాలమిక్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ రఘునందన్‌కు అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆర్థో విభాగాధిపతిగా, సూపరింటెండెంట్‌గా పనిచేశారు. అకడమిక్ డీఎంగా పదోన్నతిపై విజయవాడకు వెళ్లారు. పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. డీఎంఈ పోస్టుకు అనేక మంది పోటీ పడ్డారు. కానీ ప్రభుత్వం ప్రతిభకు పట్టం కట్టిందని వైద్య వర్గాలు అంటున్నాయి. డీఎంఈగా డాక్టర్ రఘునందన్ నియామకంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శంకర్, డాక్టర్ మధు, విభాగాధిపతులు డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ దుర్గ, డాక్టర్ ఉమామహేష్, డాక్టర్ సరళ హర్షం వ్యక్తంచేశారు. సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్, విభాగాధిపతులు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ భవాని, డాక్టర్ రాజేష్, డాక్టర్ మధుసూన్, డాక్టర్ సురేష్, పరిపాలనా విభాగం అధికారులు డాక్టర్ శ్రీనివాస్ శౌరి, డాక్టర్ సౌజన్య కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెప్పిన దారిలోనే వెళ్లండి..!

(5వ పేజీ తరువాయి)

క్లాక్ టవర్, పీటీసీ, నడిమివంక మీదుగా సాగాలి.

రూట్ -3: రుద్రంపేట, రామ్‌నగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీ వైపు నుంచి వచ్చే విగ్రహాలు రామ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా ప్రభుత్వాసుపత్రి, తెలుగుతల్లి కూడలి, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్‌లోకి చేరుకోవాలి.

ఈ ప్రాంతాల్లో నిమజ్జనం: విగ్రహాలను మూడు ప్రాంతాల్లో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. నాలుగు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. అంతకంటే తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి చెక్ డ్యామ్ వద్ద, రాచానపల్లి పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు: గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం నేపథ్యంలో అనంతపురం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకూ లారీ, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలు నిర్దేశించిన రూట్లలో నగరంలోకి ప్రవేశించాలని సూచించారు. తపోవనం సర్కిల్ నుంచి హైవే మీదుగా తడకలేరు, మార్కెట్ యార్డ్, మిర్చి యార్డ్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపు సాగాలని అన్నారు. నగరంలోని రవి పెట్రోల్ బంక్ నుంచి బెంగళూరు హైవే వైపు, రుద్రంపేట సర్వీస్ రోడ్డులోని రాజహంస అపార్టుమెంట్ నుంచి హైదరాబాద్ హైవే వైపు, పంగల్‌రోడ్డు నుంచి రాప్తాడు నేషనల్ హైవే వైపు, కలెక్టరేట్ నుంచి చెరువుకట్ట మీదుగా ఎన్టీఆర్ మార్గ్, తాడిపత్రి వైపు, మేడా పెట్రోల్ బంకు, గుత్తిరోడ్డు నుంచి ఎన్టీఆర్ మార్గ్ మీదుగా తాడిపత్రి వైపు వెళ్లవచ్చునని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి చంద్ర హాస్పిటల్ సర్కిల్ మీదుగా మిర్చియార్డ్, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా కదిరి, ధర్మవరం వెళ్లవచ్చునని తెలిపారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

అనంతపురం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కియ, సంభవ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సంభవ్ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ గంగాధర్ తెలిపారు. శనివారం అనంతపురం డిపో ఆవరణలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువత ఎల్ఎంవీ లైసెన్స్ కలిగినవారు ఇందుకు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగం వచ్చే వరకూ తమ ఫౌండేషన్ బాధ్యత వహిస్తుందన్నారు. అనంతరం కియ ప్రతినిధి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది నిరుద్యోగులకు డ్రైవింగ్ శిక్షణ ఇప్పించి, ఉద్యోగాలు కల్పించామన్నారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణకు వచ్చే అభ్యర్థులకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 40 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ టెక్నికల్ అసిస్టెంట్ నారాయణ, ట్రైనర్ అమృత్‌బాషా, సంభవ్ ఫౌండేషన్ మధుసూదన్, జాహిద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌లకు లక్కీడ్రా

- దక్కించుకున్నవారికి ధ్రువపత్రాలు

అనంతపురం క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బార్ లైసెన్స్‌లకు అధికారులు శనివారం లాటరీ తీశారు. జడ్పీ డీపీఆర్సీ భవనంలో అనంతపురం, పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శ్రీసత్యసాయి జిల్లా లాటరీలను తీశారు. అనంతపురం జిల్లాలోని 10 ఓపెన్ కేటగిరీ బార్లకు 40 దరఖాస్తులు, గీత కులాల బార్లకు 10 దరఖాస్తులు వచ్చాయి. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రా తీశారు. ఎంపికైనవారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, నాయుడు, శివసాగర్, ఇన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయనాథరెడ్డి, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్‌హుస్సేన్, కృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానించగా, ఏడింటికే దరఖాస్తులు వచ్చాయి. సాయి ఆరామంలో కలెక్టర్ టీఎస్ చేతన్ లాటరీ తీశారు. హిందూపురంలో గీత కులాలకు కేటాయించిన బార్‌తో కలిపి మూడు బార్లు, కదిరిలో రెండు, ధర్మవరం, పెనుకొండ మున్సిపాలిటీల్లో ఒక్కో బార్‌కు లాటరీ తీశారు. లైసెన్స్ దక్కించుకున్నవారికి ఎక్సైజ్ శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందునాయక్, ఏఈఎస్ నరసింహులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు పెట్టండి

- అగ్రిగోల్డ్ భూములపై సీపీఐ నాయకులు

కూడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శనివారం ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ సీఐడీ అటాచ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను రాజగోపాల్‌రెడ్డి, సాకే అభిజ్ఞ ఆక్రమించారని తక్షణం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 252 ఎకరాల్లో ప్లాట్లు వేయగా, ఆక్రమణదారులు ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ప్లాట్లను ఆక్రమించి అక్కడున్న భవనంతోపాటు కాంపౌండ్ వాల్ ధ్వంసం చేశారన్నారు. అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన వేల కోట్ల ఆస్తులు సీఐడీ అటాచ్‌లో ఉంటే కొందరు వైసీపీ నాయకులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర గార్డెన్ డెవలపర్ పేరుతో ఉన్న 22 ఎకరాల భూమిని 2014లో రాజగోపాల్ రెడ్డి పేరుతో కొనుగోలు చేశారన్నారు. ఆ భూమి మొత్తం సీఐడీ అటాచ్‌లో ఉందని, అయినా 2023లో అభిజ్ఞ పేరుతో రిజిస్ట్రేషన్ పుట్టించారన్నారు. దీనికి తోడు వంకభూములను సైతం రిజిస్ట్రేషన్ చేశారని, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర నాయకులు సిద్దేశ్వర, నారాయణప్ప, కుళ్లాయప్ప, పెరుగు సంగప్ప పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లపై ప్రజాభిప్రాయ సేకరణ

- మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని మున్సిపల్ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఆదేశించారు. రాజధాని అమరావతి నుంచి సీడీఎంఏ సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు. అనంత నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్ఓ రంగస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీలలో ఆస్తి నీటి పన్ను వసూళ్లలో అవకతవకలు నివారించి, సక్రమంగా వసూలు చేపట్టాలని ఆదేశించారు. 17 మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఆస్తి క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే మ్యుటేషన్ చేస్తారని తెలిపారు. ఇక రిజిస్ట్రేషన్, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఆటోమేటిక్ మ్యుటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. అన్నక్యాంటీన్ల నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, మరింత మెరుగ్గా నిర్వహించాలని ఆదేశించారు. నక్ష జియో ట్యాగింగ్ సర్వే నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధం అమలు పక్కాగా అమలు చేయాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అనంత నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు

క్రీడలతో క్రమశిక్షణ: ఎస్కేయూ వీసీ

అనంతపురంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల క్రమశిక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తాయని ఎస్కేయూ వీసీ ఆచార్య అనిత అన్నారు. వర్సిటీలో వ్యాయమ విద్య జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. వీసీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకట్‌నాయుడు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం పెంపొందించడంలో ఆటలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనేలా విశ్వవిద్యాలయం ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు సహాయం, విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో క్రీడా కార్యక్రమాల పురోభివృద్ధి పట్ల చర్చించారు. విశ్వవిద్యాలయ క్రీడల పోటీల వేదికను నిర్ణయించారు. గ్రూప్-ఎ పోటీలను ఎస్వీ డిగ్రీకళాశాల, గ్రూప్-బి పోటీలను బీఎస్‌వీజీఎం ప్రభుత్వ కళాశాల కళ్యాణదుర్గం, గ్రూప్-సీ పోటీలను ఎస్ఎస్‌బీఎస్ కళాశాల గుంతకల్లు, అథ్లెటిక్స్ అండ్ ఉమెన్ గేమ్స్ ప్రభుత్వ కళాశాల అటానమస్ అనంతపురం, క్రికెట్ పోటీలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నిర్వహిస్తారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జెస్సీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఫైనాన్స్ ఆఫీసర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బోర్డు మెంబర్ సెక్రటరీగా ప్రభాకర్‌రావు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించిన బోర్డు మెంబర్ సెక్రటరీగా ఎస్ఈ కేడర్ అధికారిని నియమించారు. ఇప్పటి వరకు గ్రామీణ నీటిసరఫరా ఎస్ఈనే సత్యసాయి బోర్డు మెంబర్ సెక్రటరీగా ఉండేవారు. అయితే నూతనంగా ఈఈల నుంచి ఎస్ఈ ప్రమోషన్లలో భాగంగా పార్వతీపురం గ్రామీణ నీటిసరఫరా ఈఈగా ఉన్న ప్రభాకర్‌రావును సత్యసాయిబోర్డు మెంబర్ సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గా శ్రీనివాసులు

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో డీఈలకు ఈఈలుగా ప్రమోషన్ కల్పించడంతో కర్నూలు జిల్లాలోని కోడుమూరులో గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈగా పని చేస్తున్న శ్రీనివాసులుకు ఈఈగా ప్రమోషన్‌కు అవకాశం ఏర్పడింది. దీంతో క్లియర్ వేకెన్సీ ఉన్న అనంతపురం ఈఈ స్థానానికి నియమించారు. గతంలో పని చేస్తున్న మురళీధర్‌రావు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా దాన్ని గత జూన్ ఆఖరులో ప్రభుత్వం ఆమోదించింది. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎస్ఈ సురేష్ నిర్వహించారు.

రాయదుర్గం డీఈ శ్రీనివాసులుకు ప్రమోషన్

రాయదుర్గం, సత్యసాయిబోర్డు డీఈగా ఉన్న శ్రీనివాసులకు ఈఈగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆయన్ను పులివెందుల ఈఈగా నియమించారు. దీంతో జిల్లాలో సత్యసాయి బోర్డు డీఈతో పాటు , రాయదుర్గం డీఈ స్థానం కూడా ఖాళీ కానుంది. అయితే ఏఈలకు ప్రమోషన్ కల్పించడం ద్వారా ఆయా స్థానాలను భర్తీ చేయనున్నారు. ఆ ఉత్తర్వులు కూడ మరో వారంలో రానున్నట్లు సమాచారం.

యువతి అదృశ్యం

బొమ్మనహాళ్, ఆగస్టు30, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఆమె తల్లి శనివారం బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన మేరకు ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఓ యువతి శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. శనివారం సాయంత్రం వరకు కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

న్యూస్ బాక్స్

వినాయక లడ్డూల వేలం



పుట్టపర్తిలో లడ్డూను దక్కించుకున్న శశికుమార్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక విగ్రహాల చేతిలో ఏర్పాటు చేసిన లడ్డూల వేలం పాటలో పోటీపడి పాల్గొన్నారు. ఇందులో పట్టణంలో అత్యధికంగా సాయిసదన్ వినాయక మండపంలో ఏర్పాటు చేసిన లడ్డూను పట్టణానికి చెందిన శశికుమార్ అనే యువకుడు రూ 2,64,000కు దక్కించుకున్నాడు, అలాగే సమాధి రోడ్డులో లడ్డూను వృద్ధురాలు తిరుపాలమ్మ రూ. 72వేలకు, పెద్ద బజార్‌లో సాకే జనార్దన్ రూ. 72,001కి, సాయిటవర్ వద్ద కొత్తపల్లి జయప్రకాష్ రూ. 66వేలకు దక్కించుకున్నారు.



ధర్మవరంలో వినాయక లడ్డూ, వెండినాణేలను దక్కించుకున్న వారు

ధర్మవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డు సచివాలయం వెనుక శ్రీవరసిద్ది వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూను, రెండు వెండి కాయిన్‌లకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఇందులో భాగంగా వినాయక లడ్డూ ప్రసాదాన్ని పరిశే నారప్ప రూ.2లక్షలకు దక్కించుకున్నారు. అలాగే ఒక వెండికాయిన్‌ను పరిశే నరసింహులు రూ.43.516 రెండో వెండికాయిన్‌ను పోలా చిన్నరాముడు అండ్ సన్స్ రూ.51,500కు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



కొత్తచెరువులో వినాయకుడి లడ్డూను దక్కించుకున్న భక్తుడు

కొత్తచెరువు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజులు పూజలు నిర్వహించారు. నాలుగో రోజు శనివారం వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయక లడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెందిన జయచంద్ర నాయుడు, పవన్, మణి రూ.93వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నితీశ్‌చౌదరి, భాస్కర్, నాగేంద్ర పాల్గొన్నారు.

4న ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

బత్తలపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బత్తలపల్లి అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్య దర్శి శరత్ కుమార్ మాట్లాడుతూ... ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా అక్టోబర్ 4న శతాబ్ది ఉత్సవాలను వాడవాడలా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరు పాల్గొ విజయవంతం చేయాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ యోగా, చిరంజీవినాయుడు, గోపాల్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మబ్బువారిపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అమడగూరు మండలంలోని గోపాల్‌నాయక్ తండాకు చెందిన చంద్రనాయక్ సొంత పనిమీద కొక్కంటి క్రాస్‌కు వచ్చి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. మబ్బువారిపల్లికి చెందిన రామస్వామి, తనకల్లు కు చెందిన గోవిందు ద్విచక్రవాహనంలో మబ్బువారిపల్లి నుంచి వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు మబ్బువారిపల్లి సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో చంద్ర నాయక్, రామస్వామి తీవ్రంగా గాయపడగా, గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వందేమాతరం అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. కదిరిలో పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషయంగా ఉండడంతో చంద్రనాయక్‌ను, రామస్వామిని అనంతపురం తరలించినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చౌడేపల్లి తారా సోమశేఖర్ (52) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఈ నెల 24న ఆదివారం ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి మహమ్మదాబాద్ క్రాస్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రాన్స్ జెండర్లపై దాడి

కదిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లికి చెందిన బంగారు సానియా ఆలియాజ్ సురేష్‌పై కందికుంట నారాయణమ్మ కాలనీకి చెందిన ఈశ్వరయ్య, నారాయణ స్వామి, సుజాత, సుమతి అనేవారు దాడిచేసినట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సానియా, ఆమె స్నేహితురాలు రియా కలిసి శుక్రవారం రాత్రి కంది కుంట నారాయణమ్మ కాలనీలో ఉన్న వారి గురువు చందు ఇంటికి వెళ్తున్నారు. అదే కాలనీలో ఉంటున్న నారాయణ స్వామితోపాటు మరికొంతమంది మహిళలు హేళనగా, అసభ్యకరంగా మాట్లాడారు. దీన్ని ప్రశ్నించిన ట్రాన్స్ జెండర్లపై దాడిచేసినట్లు సీఐ తెలిపారు. సానియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బొగ్గు తరలింపుపై జరిమానా



కొక్కంటిక్రాస్‌లో ఉంచిన బొగ్గు లారీ

తనకల్లు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పదిరోజుల క్రితం మహా రాష్ట్రకు బొగ్గులను తరలిస్తున్న లారీని అమడగూరు మండలం లోని చినగానిపల్లి సమీపంలో పీలేరుకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ గురుప్రభాకర్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. లారీని తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న బాలసముద్రం సెంట్రల్ నర్సరీలో ఉంచారు. పదిరోజుల అనంతరం శనివారం లారీలో బొగ్గులు తరలిస్తున్న వారికి రూ.3,01,392 జరిమానా విధించినట్లు డిఎఫ్ గురుప్రభాకర్ తెలిపారు. జరిమానాను నేరుగా బ్యాంక్‌లో జమ చేసి, రసీదు తీసుకొచ్చి లారీని తీసుకెళ్లాలన్నారు. కదిరి ప్రాంతంలో ఎక్కడైనా అనుమతి లేకుండా బొగ్గులు బట్టీలు ఏర్పాటు చేసినా, బొగ్గులు తరలిస్తున్నట్లు సమాచారమున్నా, వెంటనే 9440810114 తెలియజేయాలని ఆయన తెలిపారు. ఫ్లయింగ్ పస్క్వాడ్ డిఎఫ్ గురుప్రభాకర్ తెలిపారు.





పుట్టపర్తి పట్టణంలో గణేష్ నిమజ్జనంలో యువత కోలాహం



స్టేట్ బ్యాంకు రోడ్డులో ఉట్టికొట్టే ఉత్సవం

జయహో గణనాయక..!



గొల్లపల్లి వంకలో నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం

● భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజు శనివారం నిమజ్జనం చేశారు. సాయంత్రం ఆయా పట్టణాలు, గ్రామాల్లో ఊరేగించి స్థానిక చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేశారు.





ధర్మవరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు



గాండ్లపెంటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకులు



ధర్మవరం చెరువులో నిమజ్జనం చేస్తున్న బీజేపీ నాయకులు



కొత్తచెరువులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



నల్లచెరువులో...



నల్లమాడలో...



ఎన్పీకుంటలో...



ఓబుళదేవర చెరువులో...



నిమజ్జనానికి సిద్ధం చేస్తున్న సత్యసాయి విద్యార్థులు

పరిటాల రవి వ్యక్తి కాదు.. శక్తి

● ఘనంగా జయంతి వేడుకలు



ధర్మవరంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పరిటాల రవి వ్యక్తి కాదు... ఒక శక్తి అని టీడీపీ నా యకులు కొనియాడారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 67వ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు తెలుగుమహిళలు, టీడీపీ నాయకులు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. టీడీపీ కార్యాలయం వద్ద పేదలకు అల్పా హారం విందు ఏర్పాటుచేశారు. పరిటాల రవి ఆశయ సాధనకు పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో ముందుకు వెళ్తున్నామన్నారు. టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, అత్తర్‌రహీం, జింకల రాజన్న, చీమల రామాంజి, కరెంటు ఆది, రాంపురం శీన, చిన్నూరు విజయ్‌చౌదరి, బొట్టు కిష్ట, సాయిక్రిష్ణ, పల్లపు రవి, బీరే శ్రీరాములు, టైలర్ గోపాల్, అడ్ర మహేష్ గోసల శ్రీరాములు కేతినేని రాజ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న తెలుగు మహిళలు

● ధర్మవరంరూరల్: పేదప్రజల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర అని టీడీపీ ధర్మవరం మండల నాయకులు కొనియాడారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలకు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. కేక్ కట్ చేసి ఆయన సేవలను కొనియాడారు.

● బత్తలపల్లి : మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

●కదిరి: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతిని శనివారం స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంట్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. టీడీపీ రాష్ట్ర మైనారిటీ నాయకురాలు పర్వీనాబాను, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కొమ్మినేని గం గయ్య నాయుడు, కౌన్సిలర్ సావిత్రమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ఉమాకు ఘన నివాళి



శ్రీనివాస కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ధర్మవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ వర్ధంతిని పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ, జూనియర్ కళాశాలలో శనివారం జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ముసలిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమాడ/ బుక్కపట్నం/పుట్టపర్తి రూరల్: మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమ వర్ధంతిని శనివారం నిర్వ హించారు. నల్లమాడ, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల నుంచి పెద్దఎత్తు న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనంతపురంలోని వ్యవ సాయ క్షేత్రంలో పల్లె ఉమ ఘాట్‌కు తరలి వెళ్లారు. పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

మానవహక్కుల దినోత్సవం

తనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లిలో శనివారం తహసీల్దార్ షాబుద్దీన్, డీవీసీ సభ్యులు చేరుకూరి గంగులయ్య ఆధ్వర్యంలో మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామస్థులకు చట్టాల గురించి వివరించారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు: డీడీఏ

కొత్తచెరువు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రధానంగా సాగుచేసే వరి, మొక్కజొన్న, వేరుశెనగ పంటల్లో యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శ్రీరామ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని పోతు కుంటగ్రామం రైతు సేవాకేంద్రంలో శనివారం పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. స్థానిక వ్యవసాయాధికారి సతీశ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీడీఏ శ్రీరామ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేరుశనగ, కంది, వరి, మొక్కజొన్న పంటలకు సంబంధించి సాగులో చేపట్టాల్సిన మెళకువలు, నీటి యాజ మాన్యం, పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు ఆయన వివరించారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన వేరుశనగపొలాన్ని సందర్శించి అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ

యూటర్న్ లేక ఇబ్బందులు

కదిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి శివారు ప్రాంతంలో ఉన్న వివిధ కార్యాలయాల వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి గట్టు ప్రాంతంలోని వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వరకు ఇటీవల నిర్మించిన నాలుగురోడ్ల రహదారిలో ఎక్కడా యూటర్న్ లేదు. దాదాపు ఒకటిన్నర కిలోమీటరు వరకు ఇలాంటి పరిస్థితి ఉంటుంది. ఈ మధ్యలోనే ఎంపీడీఓ, వెలుగు, డీఎస్పీ, ఆర్టీఓ కార్యాలయాలతో పాటు దాదాపు వెయ్యికిపైగా టిడ్కోఇళ్లు, ఆర్అండ్ ఆర్ కాలనీలు ఉన్నాయి. వీరందరూ రహదారిలోని ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లాలంటే గట్టు వరకు వెళ్లి తిరిగి రావాలి. లేదా అదే రోడ్డు వ్యతిరేక దిశలో వెళ్లాల్సి ఉంది. ఇలా చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశ ముంది. వెంటనే వివిధ కార్యాలయాల వద్ద, టిడ్కో ఇళ్ల వద్ద యూటర్న్‌లు ఏర్పా టు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్టీఓ కార్యాలయం ఎదుట యూటర్న్‌లేని దృశ్యం

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆకుపూజ అందుకున్న గొట్లూరు ఆంజనేయస్వామి

ధర్మవరం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులో వెలసిన అంజ నేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సత్య నారాయణ స్వామివారి మూలవిరాట్‌కు ఆకుపూజ చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రికి ఆలయంలో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన శిక్ష

● మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జయలక్ష్మి

కదిరి లీగల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేస్తే ఆ కుటుంబ సభ్యులు కటకటాలు లెక్క పెట్టాల్సి ఉంటుందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఆ పెళ్లికి హాజరైన వ్యక్తులు, చివరకు పెళ్లి జరిపించిన పురోహితులు కూడా శిక్షార్హులేనని హెచ్చరించారు. కదిరి మండలం కాలెడ్డిపల్లి గిరిజన తండాలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్య వివాహాలు, ముందస్తు గర్భధారణ వంటి వాటి దుష్పరిణామాలపై చైర్మన్ మాట్లాడారు. రూరల్ వైద్య అధికారులు గిరిజనుల కోసం నిర్వహించిన ఉచిత మందులను పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రాధిక, డాక్టర్ వినోద్‌కుమార్, ఎంపీడీఓ ఇన్చార్జ్ భాగ్యమ్మ, ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల రెడ్డి, రెడ్ సంస్థ అధ్యక్షురాలు భాను జామెహతాజ్, న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడికేసులో నిందితుల అరెస్టు

కదిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డాక్టర్, ఇతర సిబ్బందిపై దాడిచేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా డీఎస్పీ శివనారాయణస్వామి కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద ఏడుగురిని అరెస్టు చేశారన్నారు. దేవిశెట్టి అనిల్‌కుమార్, సాయిగణేష్‌యాదవ్, రాజశేఖర్, కనుంపల్లి భరత్, కార్తీక్, మణికంఠ, దేరంగుల అశోక్ ఉన్నారు. వీరిపై హత్యాయత్నం, ఎస్టీ ఎస్సీ కేసు నమోదైనట్లు చెప్పారు.

కృష్ణా జలాలకు పూజలు



కొక్కంటిక్రాస్ వద్ద పూజలు చేస్తున్న కూటమి నాయకులు

తనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొక్కంటి క్రాస్ సమీపంలో హంద్రీ నీవా కాలువలో శనివారం కృష్ణాజలాలకు కూటమి నాయకులు జలహారతి ఇచ్చారు. కాలువ వద్ద గంగమ్మకు పసుపు, కుంకుమ, పూలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టారు. ఘనంగా జలహారతి నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు కావడి ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, గోవిందు, శంకర్‌నాయుడు, బాగేపల్లి చలపతి, తోట సరోజమ్మ, సోంపాల్యం నాగభూషణం, మధుకర్‌నాయుడు, రమణా రెడ్డి, వెంకటరమణ, దస్తగిరి, క్రిష్ణానాయక్, ఉత్తన్ననాయక్, రమణ, రెడ్డెప్పరెడ్డి, జనసేన రమణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బలహీనవర్గాల ఆశాజ్యోతి పరిటాల: ఎంపీ బీకే



పరిటాల రవీంద్ర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీకే, నాయకులు

పెనుకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. శనివారం పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిటాల రవీంద్ర అస్తమించని సూర్యుడని, ఆయన భౌతికంగా ప్రజల మధ్యలేకున్నా వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. రొద్దం నరసింహులు, శశిభూషణ్ పటేల్, రవి, గాయిత్రి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిర టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి ఆర్.అశోక్ కుమార్ కోరారు. సెప్టెంబరు 13న స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం సీఐలు, పోలీసు అధికారులతో న్యాయాధికారి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను పరిష్కరిస్తామన్నారు. రాజీమార్గమే రాజమార్గం అని, సామరస్యంగా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

'కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలి'



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం అనురాధ

గోరంట్ల, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలని నాబార్డు డీడీఎం అనురాధ సూచించారు. మండలంలోని వానవోలు సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమెతోపాటు సహకార బ్యాంక్ డీజీఎం సుకదేవ్‌బాబు హాజరయ్యారు. సహకార పరపతి సంస్థలకు వాటా మూలధనం సమకూర్చుకోవడానికి నాబార్డు రీఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తోందని ఆమె తెలిపారు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇరవై ఏళ్ల కాలపరిమితితో దీర్ఘకాలిక రుణాలిస్తోందన్నారు. అనంతరం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సహకార సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, సభ్యులు నగేష్, శ్రీనివాసులు, సీఈవో క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, రాఘవనాయుడు, మల్లికార్జున, రుషేంద్ర, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న రమానందన్

లేపాక్షి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దుర్గావీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ అన్నారు. శనివారం చోళసముద్రం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.2లక్షలు విలువచేసే మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పాఠశాలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని మిమ్మల్ని చదివిస్తున్నారని బాగా చదివి వారి కలలను సాకారం చేయాలన్నారు. 2024-25లో పదోతరగతిలో 526మార్కులు సాధించిన బిసలమానేపల్లికి చెందిన సుమంత్‌కు రూ.50వేలు విలువచేసే ల్యాప్‌టాప్‌ను అందించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీవైఈఓకు సన్మానం



డీవైఈఓ జాన్‌రెడ్డెప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డీవైఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన జాన్ రెడ్డెప్పను వానవోలు ఉన్నతపాఠశాలలో శనివారం ఘనంగా సన్మానించారు. గోరంట్ల ఎంఈఓ పనిచేస్తున్న జాన్‌రెడ్డెప్ప పెనుకొండ ఇన్‌చార్జి డీవైఈఓగా ఇటీవల అదనపు బాధ్యతలు చేపట్టిరు. వానవోలు కాంప్లెక్సు పరిధిలోని ఉపాధ్యాయులు శాలువ, పూలమాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఈశ్వరమ్మ, రామక్రిష్ణ, నిషార్‌అహమ్మద్, నాగేష్ పాల్గొన్నారు.

వేగంగా నల్లూరు బ్రిడ్జి నిర్మాణ పనులు



నల్లూరు-కల్లుకుంట గ్రామాల మధ్య పెన్నానదిపై బ్రిడ్జి పనులు

రొద్దం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూరు వద్ద పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రొద్దం మండలం నల్లూరు, కల్లుకుంట గ్రామం మధ్యలో బ్రిడ్జి నిర్మాణాన్ని మంత్రి సవిత 2.8కోట్లతో నిధులను మంజూరు చేయించారు. వేగంగా పనులు జరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోఏళ్ల కల సాకారం కానున్నట్లు మాజీ సర్పంచ్ గోపాల్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కల్లుకుంట నల్లూరు, చోళేమర్రి తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయి.

లోపించిన పారిశుధ్యం

- రోడ్లపైనే మురుగునీటి ప్రవాహం
- రోగాలతో అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

మడకశిర రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. రెండువారాల పాటు ఎడితెరిపి లేకుండా వర్షాలు కురవడంతో గ్రామాల్లో వీధులు, రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో దోమలు వ్యాప్తిచెంది ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. మండలంలో 16 పంచాయతీలు, 110 గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీలు లేకపోవడం, మరికొన్ని గ్రామాల్లో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తున్నాయి. చిన్నారులు,



ఇళ్ల మధ్యనే పారుతున్న మురుగునీరు

వృద్ధులు జ్వరాలు, జలుబు దగ్గు తదితర జబ్బులబారిన పడుతున్నారు. మండలంలోని కదిరేపల్లి, కల్లుమర్రి, గుండుమల, నీలకంఠాపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి రోజుకు సగటున 70 నుంచి 120 మంది వరకు రోగులు వస్తున్నారు. మరికొంత మంది ప్రైవేట్ క్లినిక్‌లకు వెళుతున్నారు. అయితే పంచాయతీలను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యగా మారింది. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే నాథుడు లేడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి

● డాక్టర్ నరేష్ కుమార్, కదిరేపల్లి



నీరు కలుషితం కాకుండా తగుజాగ్రత్త తీసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇళ్లలో నీరు నిల్వ ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు డ్రమ్ములు, తొట్టెలను శుభ్రం చేసుకోవాలి. చిన్నాపాటి అనారోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేయిస్తాం

● కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నగర పంచాయతీ పరిధిలో రూ.లక్షలోపు జరిగిన పనులకు సంబంధించి విజిలెన్స్ ఎంక్వైరీ చేయిస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం నగరపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ అనుసరించిన అప్రజాస్వామిక విధానాల వల్ల నగరపంచాయతీ పూర్తిగా నష్టపోయిందన్నారు. గట్టెక్కించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. నగర పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి పనులు చేపట్టాలన్నా టెండర్లు వేయాలన్నారు. ఈ వ్యవహారంలో పూర్తిగా పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో మౌలిక సదుపాయాలు శాశ్వత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం కావడం వల్ల ప్రతి వార్డులో దోమలు నివారించేందుకు ఫాగింగ్ చేయాలని సూచించారు. తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు ఎక్కడ అవసరం ఉంటే అక్కడ వెంటనే చేపట్టాలన్నారు. పట్టణంలో జరగవలిసిన అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజ, కమిషనర్ జగన్నాథ్, వైస్ చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అవరణలో సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. 44మంది లబ్ధిదారులకు రూ.14.52 లక్షల చెక్కుల పంపిణీ చేశారు రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కన్వీనర్ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, డాక్టర్ క్రిష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

అమరాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఈశ్వరీయ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు రాజయోగిని పుష్పలత తెలిపారు. పట్టణంలోని ఓంశాంతి ప్రార్థనా మందిరంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ బంధుత్వ దినోత్సవంలో భాగంగా రాజయోగిని దాది ప్రకాశ మణిజివారి 18వ స్మారక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మకుమారీ మెడిటేషన్ సెంటర్ గంగోత్రి భవనం పోలీస్‌స్టేషన్ రోడ్, ఆదివారం ఉదయం 9-30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రక్తదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలవారు, యువకులు హాజరై రక్తదానం చేయాలని కోరారు.

రేపు ప్రభుత్వ విశ్రాంత నౌకర్లకు సన్మానం

పావగడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసి పదవీ విరహన పొందిన నౌకర్లను సోమవారం సన్మానించిననున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి, ఎమ్మెల్యే వెంకటేశ్, రాష్ట్ర నౌకర్ల సంఘం అధ్యక్షుడు షడక్షరి పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మేఘాలయ గవర్నర్‌కు సన్మానం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పావగడ మాజీ ఎమ్మెల్యే

పావగడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయ శంకర్‌ను తుమకూరు పట్టణంలోని అర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయ సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌడేటి ప్రభాకర్, మైసూర్ విశ్రాంత అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రప్ప, నాగరాజు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రామ సచివాలయం

పరిగి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యర్రగుంట సచివాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు సచివాలయం గోడలు తడిసి మెత్తబడ్డాయి. గోడలంతా పాచిపట్టి కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్లు తడిసిపోయాయి. నూతన సచివాలయ భవనం నిర్మించకపోవడంతో ఇంకా పాడుపడిన భవనంలోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ భవన నిర్మాణాలు ప్రారంభించి నిధులు పూర్తిస్థాయిలో విడుల చేయకపోవడంతో అర్థాంతరంగా ఆగిపోయాయి. అధికారులు స్పందించి కొత్త సచివాలయ భవనం నిర్మించాలని ప్రజలు, సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.



వర్షానికి పాచిపట్టిన సచివాలయ భవనం గోడలు

క్లస్టర్ సమావేశానికి హాజరుకండి: డీఈఓ

గోరంట్ల, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో నిర్వహించే క్లస్టర్ సమావేశానికి ప్రతిఉపాధ్యాయుడు తప్పక హాజరు కావాలని డీఈఓ క్రిష్టప్ప ఆదేశించారు. మండలంలో ఆరు క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలను శనివారం నిర్వహించారు. గోరంట్ల బాలుర ఉన్నతపాఠశాల కాంప్లెక్సు సమావేశాన్ని ఆయన సందర్శించారు. పెనుకొండ డీవైఈఓ జాన్‌రెడ్డెప్ప, ఎంఈఓ గోపాల్ హాజరయ్యారు. సమావేశాల్లో చర్చించిన అంశాలను పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఈఓ సూచించారు. సమావేశంలో సాయంత్రం 5గంటలవరకు ఉండాలని, సెలవులు ఉపయోగించుకోవడానికి వీలు లేదన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్‌ప్రసాద్, దామోదర్‌రెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులున్నారు.

రొళ్ల(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రాథమిక, జిల్లాపరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రవికృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్ కార్యక్రమాన్ని సందర్శించారు. అజెండాలోని అంశాలను సెషన్ల వారిగా వివరించారు.

'ఉద్యోగులు ఒత్తిడికి గురికాకూడదు'

హిందూపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఒత్తిడికి గురికాకూడదని మానసిక వైద్య నిపుణులు జీవన అన్నారు. హిందూపురం మండలం తూమకుంటలో విప్రోకేర్ సహకారంతో వాసవ్య మహిళా మండలి కుషల్ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో విప్రో పాత ప్లాంట్ ఉద్యోగులకు మానసిక ఒత్తిడిపై అవగాహన కల్పించారు. వైద్యురాలు మాట్లాడుతూ అధిక పనిభారం సమయ పట్టికలు వ్యక్తిగత జీవన విధాన లోపం, ఆహారంలో ప్రొటీన్‌లోపంవల్ల ఒత్తిడికి కారణాలు అవుతున్నాయన్నారు. విప్రో ఉద్యోగులు మాచయ్య, కాంతి కిరణ్, కొండలరావు, గురుదత్, డాక్టర్ సల్మా, సిరీశలలిత పాల్గొన్నారు.

పట్టు రైతు అభివృద్ధిలో రీలర్ ముఖ్యం: జేడీ

హిందూపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టు రైతు అభివృద్ధి రీలర్ ముఖ్యమని సెరికల్చర్ జేడీ శోభారాణి అన్నారు. పట్టురైతులు అభివృద్ధి చెందాలంటే రీలర్లు కూడా ముఖ్యమన్నారు. శనివారం పట్టు గూళ్ల మార్కెట్ ఆవరణలో నా పట్టు నా అభిమానం కార్యక్రమంలో భాగంగా రీలర్లతో అధికారులు సమావేశమయ్యారు. సెరికల్చర్ జేడీ, అసిస్టెంట్ ఏడీ రత్నం, శాస్త్రవేత్త సంజీవ్‌గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలోనే హిందూపురంలో రేషం రీలర్లు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. అందుకే హిందూపురానికి ఎన్ని పట్టుగూళ్లు వచ్చినా క్రయ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. వాక్యూమ్‌పర్మీయేషన్, కుకింగ్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. సిల్కునాణ్యత ప్రమాణాలు, గ్రేడింగ్ విధానంపై వివరించారు.

గుండెపోటుతో యువకుడి మృతి

పెనుకొండ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో తిప్పన్న కుమారుడు నాగరాజు(30) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవ కార్యక్రమంలో నాగరాజు పాల్గొని రాత్రి 12గంటల వరకు ఉత్సాహంగా గడిపాడు. అనంతరం ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటు వచ్చి అస్వస్థతకుగురయ్యాడు. బంధువులు, స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. నాగరాజు మృతితో గ్రామంలో విషాధ ఛాయలు నెలకొన్నాయి.

సమాజంలో రుగ్మతలు రూపుమాపాలి

● న్యాయాధికారి కంపెల్ల శైలజ



మాట్లాడుతున్న న్యాయాధికారి కంపెల్ల శైలజ

హిందూపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పట్టి పీడిస్తున్న మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు, తదితర రుగ్మతులను రూపుమాపాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం మండలంలోని వినాయకనగర్‌లో న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుత తరుణంలో మాదకద్రవ్యాలు పట్టి పీడిస్తున్నాయన్నారు. వాటి నిర్మూలనకు కృషిచేయాలన్నారు. బాల్యవివాహాలవల్ల చాలా అనర్థాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయం పొందవచ్చని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. డీటీ మైనుద్దీన్, సర్పంచ్ భాగ్యమ్మ, న్యాయవాదులు కళావతి, సంతోష్‌కుమారి, రవిచంద్ర, ప్రకాశ్, నరేష్ పాల్గొన్నారు.

విద్యతోనే జీవితాల్లో మార్పు

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవితాల్లో మార్పు వస్తుందని హిందూపురం సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర నాయక్ అన్నారు. మండలంలోని దిగువపల్లి తండాలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయాధికారి హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. అన్ని రకాలుగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ కులాలను అందరితో సమానంగా రాజ్యాంగం హక్కులు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా పిల్లలను విద్యావంతులుగా తీర్చిద్దాలన్నారు. విద్యతోనే వెనుకబడిన జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. ఎంతో మంది వెనుకబడిన కులాల్లో జన్మించినా వారు విద్యావంతులు కావడంతోనే అత్యున్నత స్థాయిలో ఉండగలుగుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రైబల్ యాక్ట్, పోక్సో చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. న్యాయవ్యవస్థలో అందరూ సమానమేనని, ఎవరు తప్పు చేసినా శిక్ష ఒక్కటే ఉంటుందన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉంటూ పిల్లలకు సరైన వయసు వచ్చిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ జగన్నాథం, ఎంపీడీఓ రమణమూర్తి, సర్పంచ్ నీలాబాయి, కార్యదర్శి భాస్కర్, బాబేనాయక్, చంద్రానాయక్, కృష్ణానాయక్, న్యాయవాది కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రొళ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లినమడుగు దళిత కాలనీలో శనివారం కాలనీవాసులకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరియప్ప పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాల గురించి విద్య ఆవశ్యకత, సమాజంలో జరుగుతున్న సంఘటనలు, వివిధ అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఏఎస్ఐ హిదాయతుల్లా, వీఆర్ఓ గిరి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గంగ ఒడికి గణనాథుడు

వినాయక చవితి పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను శనివారం నాలుగో రోజు నిమజ్జనానికి తరలించారు. హిందూపురంతో పాటు, కిరికెర, ముద్దిరెడ్డిపల్లి, పూలకుంట, కొటిపి, పలు గ్రామాల్లో గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని కుంటల్లో నిమజ్జనం చేశారు. యువత కేరింతలతో నృత్యం చేస్తూ వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్







హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



సోమందేపల్లి: రూ.21,500కు లడ్డూను దక్కించుకున్న గీతానగర్ వాసులు



గోరంట్ల మండలం పూలచెట్లపల్లిలో కాంట్రాక్టర్ దేరంగుల రామాంజనేయులు వేలంలో వినాయక లడ్డూను రూ.20,116లకు దక్కించుకున్నారు.



పెనుకొండ రూరల్: చంద్రగిరిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



చిలమత్తూరు: కనిశెట్టిపల్లిలో నిమజ్జనానికి గణనాథున్ని సిద్ధం చేస్తున్న గ్రామస్థులు




మడకశిర రూరల్: జమ్మానిపల్లిలో ఊరేగింపుగా వస్తున్న వినాయకు విగ్రహాలు



లేపాక్షిలో నిమజ్జనోత్సవం

పూజలందుకున్న గణనాథులు





మడకశిరలో పూజలందుకుంటున్న వర్తక వినాయకుడు, గాంధీ గణపతి



పరిగిలో గణపతిని దర్శించుకుంటున్న భక్తులు